## నెల్లూరులో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు



వివరాలు 4లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM    WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి    సంపుటి:3    సంచిక : 302    సంపాదకులు: కలిచేటి వెంకయ్య    సోమవారం 28 సెప్టెంబర్ 2026    పేజీలు: 8    వెల: 2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad




## హెచ్-1బీ వీసాలో భారీ మార్పులు.. ఏడాదిలో కొత్త రూల్స్!

- విదేశీ కార్మిక వీసా మోసాలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కార్
- అరెస్టులకు సిద్ధంగా ఉన్నామన్న అమెరికా కార్మిక శాఖ ఉన్నతాధికారి
- కాగ్నిజెంట్, క్లౌడెరా వంటి సంస్థల వీసా దరఖాస్తులు సస్పెండ్
- అమెరికన్ల ఉద్యోగాల పరిరక్షణే లక్ష్యంగా కఠిన చర్యలు

**అమెరికా:** అమెరికాలో అత్యంత కీలకమైన హెచ్-1బీ వీసా విధానం రాబోయే ఏడాది కాలంలో గణనీయంగా మారనుంది. విదేశీ కార్మిక వీసాల విషయంలో జరుగుతున్న మోసాలపై ట్రంప్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండటంతో ఈ మార్పులు అనివార్యమని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. రాబోయే 365 రోజుల్లో విదేశీ కార్మిక వీసా కార్యక్రమంలో కీలక మార్పులు మిగతా 2లో...

# పల్లె పండుగ 3.0

## ఈ నెల 29న రామాపురంలో చంద్రబాబు, పవన్ పర్యటన

- ఈ నెల 29న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- నెల్లూరు జిల్లా రామాపురంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు

**అమరావతి, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం,



తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు మిగతా 2లో...



## లవ్లీ యూనివర్సిటీలో అత్యాచారం వదంతులు.. క్యాంపస్‌లో విద్యార్థుల విధ్వంసం

- పంజాబ్ 'ఎల్‌పీయూ'లో విద్యార్థుల భారీ ఆందోళన
- సోషల్ మీడియాలో అత్యాచారం వదంతులతో ఉద్రిక్తత
- క్యాంపస్‌లో విధ్వంసం, జాతీయ రహదారి దిగ్బంధం
- అత్యాచారం ఆరోపణల్లో నిజం లేదన్న పోలీసులు
- వదంతులపై దర్యాప్తు చేస్తున్న అధికారులు

**పంజాబ్:** పంజాబ్‌లోని ఫగ్వారాలో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ)లో శనివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బయటి వ్యక్తి ఒకరు క్యాంపస్‌లో ఒక విద్యార్థినిపై అత్యాచారం చేశాడంటూ సోషల్ మీడియాలో నిర్ధారణ లేని వార్తలు వ్యాపించడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. శనివారం అర్ధరాత్రి దాదాపు 2 గంటల సమయంలో యువతుల హాస్టల్ వద్ద మొదలైన ఈ నిరసనలో సుమారు 2,000 మంది మిగతా 2లో...



## ఏఐతో 100 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు: బిల్‌గేట్స్

- దుష్టశక్తుల చేతిలో ఏఐతో పెను ప్రమాదమన్న బిల్‌గేట్స్
- పరిశ్రమ స్వీయ నియంత్రణ సరిపోదని, ప్రభుత్వ చట్టం అవసరమని స్పష్టీకరణ
- సైబర్ దాడులు, జీవ ఆయుధాల వంటి ప్రమాదాలపై ఆందోళన

**అమెరికా:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన హెచ్చరికలు జారీ చేశారు. దుష్టశక్తుల చేతిలో ఏఐ చిక్కితే అది దాదాపు 100 కోట్ల మంది మరణాలకు దారితీసే పెను విపత్తుకు కారణం కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ అమెరికన్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ స్వయంగా మానవాళిని నాశనం చేస్తుందని తాను భావించడం లేదని గేట్స్ స్పష్టం చేశారు. అయితే, దురుద్దేశాలు ఉన్న వ్యక్తులు ఆధునిక ఏఐ టూల్స్‌ను ఉపయోగించి చేసే సైబర్ దాడులు, జీవాయుధాల (బయో వెపన్స్) ప్రయోగం వంటివి ఊహించని నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు. ఈ ప్రమాదాన్ని మిగతా 2లో...

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాల నిర్వహణ
- అక్టోబరు 16న గరుడ వాహనం, 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరగనున్న ఉత్సవాలు
- వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ

**తిరుమల, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్:** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు విడుదల చేశారు. ఇటీవలే టీటీడీ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దసరా బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమవుతోంది. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం కారణంగా ఈ ఏడాది స్వామివారికి రెండోసారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కన్యామాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో మిగతా 2లో...




## నేటి నుంచి బ్యాంకులు బంద్

### నిలిచిపోయే సేవలు ఏమిటి? కొనసాగేవి ఏవి?

- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె
- 5 రోజుల పని వారం, పెన్షన్ తదితర డిమాండ్లతో సమ్మెకు పిలుపు
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిలిచిపోనున్న నగదు, చెక్ సేవలు
- యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలకు అంతరాయం ఉండదు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు ఇది ముఖ్యమైన సమాచారం. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మూడు రోజుల పాటు సమ్మెకు దిగుతున్నాయి. సెప్టెంబర్ 28 (సోమవారం) నుంచి సెప్టెంబర్ 30 (బుధవారం) వరకు ఈ సమ్మె జరగనుంది. దీంతో బ్యాంకు బ్రాంచులలో అందించే పలు కీలక సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సమ్మెకు కారణాలు ఇవే..
వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలన్నది బ్యాంకు యూనియన్ల ప్రధాన మిగతా 2లో...

## పల్లెల్లో అభివృద్ధి వెలుగులు

- పల్లె పండుగ--3.0తో రూ.11,085 కోట్లతో పనులు
- 29న ఉదయగిరిలో శ్రీకారం
- గ్రామీణ మౌలిక వసతులకు కొత్త ఊపు
- పామూరు సభలో ఎమ్మెల్యే ఏలూరి



**పామూరు, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్:** పల్లె పండుగ--3.0తో గ్రామాల్లో అభివృద్ధి పనులకు మరింత ఊపునిచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పల్లె పండుగ 3.0 ఉదయగిరి అబ్జర్వర్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రూ.11,085 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో భారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 29న నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పల్లె పండుగ--3.0 పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. పామూరులోని పువ్వాడి ఫంక్షన్‌హాల్‌లో కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏలూరి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, 29న జరిగే కార్యక్రమానికి జనసమీకరణ, రవాణా, భోజన సదుపాయాలపై నాయకులతో చర్చించారు. పల్లె పండుగ--3.0లో భాగంగా రూ.2,700 కోట్లతో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు మిగతా 2లో...

## పల్లె పండుగ 3.0

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది.సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు.

## ఏఐతో 100 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు: బిల్‌గేట్స్

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కోవడానికి పరిశ్రమ స్వీయ నియంత్రణ సరిపోదని, ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఆయన సూచించారు. వాషింగ్టన్‌లో దీనిపై చట్టం తీసుకురావడం తప్పనిసరి అని, ఇది పరిశ్రమపై కొంత భారం మోపినప్పటికీ, అభివృద్ధిని పెద్దగా నిరోధించదని అన్నారు.ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ వంటి ఇతర టెక్ నిపుణులు కూడా ఏఐ నియంత్రణ ఆవశ్యకతపై గళం విప్పిన విషయం తెలిసిందే. రాబోయే ఐదేళ్లలో మానవుల కంటే తెలివైన 'సూపర్ ఇంటెలిజెంట్' ఏఐ వ్యవస్థలు వచ్చే అవకాశం ఉందని, వాటిపై మానవ నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని బ్రిటన్‌కు చెందిన అలన్ ట్యూరింగ్ ఇనిస్టిట్యూట్ నివేదిక కూడా ఇటీవల హెచ్చరించింది.ప్రస్తుతం ఏఐ ఏజెంట్లు అనధికారికంగా హ్యాకింగ్ ప్రయత్నాలు చేయడం, డ్రోన్ దాడులకు ప్లాన్ చేయడం వంటి ఘటనలు నమోదవుతున్న నేపథ్యంలో గేట్స్ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏఐ అభివృద్ధి వేగం, దాని దుర్వినియోగం వల్ల మానవాళికి ఎదురయ్యే ప్రమాదాలపై ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చను రేకెత్తించాయి.

## నేటి నుంచి బ్యాంకులు బంద్

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్‌గా ఉంది. దీంతో పాటు పెన్షన్ ప్రయోజనాల్లో మార్పులు, ఇతర సర్వీస్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసమే సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రధానంగా పాల్గొంటున్నందున వాటిపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రైవేట్ రంగ బ్యాంకులపై ఈ ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉంది.

**నిలిచిపోయే సేవలు ఇవి..**

ఈ మూడు రోజుల సమ్మె వల్ల బ్యాంకు బ్రాంచులకు వెళ్లి చేసుకోవాల్సిన పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ముఖ్యంగా **కింది సేవలు నిలిచిపోవచ్చు:**

బ్రాంచులలో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు.
పాస్‌బుక్ అప్‌డేట్, ప్రింటింగ్.
చెక్ క్లియరింగ్, ఇతర చెక్ సంబంధిత లావాదేవీలలో జాప్యం.
కొత్త డిమాండ్ డ్రాఫ్టుల (డీడీ) జారీ.
కేవైసీ, అకౌంట్ వివరాల మార్పులు వంటి పనులు.
లోన్ దరఖాస్తులు, డాక్యుమెంటేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలు.
బ్యాంక్ లాకర్ సేవలు.

**కొనసాగనున్న సేవలు**

బ్రాంచులలో ప్రత్యక్ష సేవలు నిలిచిపోయినా, డిజిటల్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని యూనియన్లు తెలిపాయి. యూపీఐ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఖాతాదారులు తమ లావాదేవీలను యథావిధిగా జరుపుకోవచ్చు. ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నగదు డిపాజిట్ మెషీన్లు కూడా పనిచేస్తాయి.

**ఆదివారం పనిచేస్తున్న బ్యాంకులు**

సమ్మె కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ అనుమతితో నేడు (ఆదివారం) కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను పనిచేయాలని ఆదేశించింది. దీంతో ఖాతాదారులు తమ అత్యవసర బ్యాంకు పనులను ఆదివారమే పూర్తి చేసుకోవచ్చు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు బ్రాంచులు మూసి ఉండనున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## లవ్లీ యూనివర్సిటీలో అత్యాచారం వదంతులు.. క్యాంపస్‌లో విద్యార్థుల విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపస్ భద్రత, యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు యూనివర్సిటీ గేటు, కిటికీ అద్దాలు, సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. పూల కుండీలు, ఇటుకలతో దాడి చేయడంతో పాటు కొన్నిచోట్ల నిప్పు పెట్టినట్లు కూడా సమాచారం. అనంతరం విద్యార్థులు సమీపంలోని జలంధర్-ఫగ్వారా జాతీయ రహదారిని దిగ్బంధించడంతో ఆదివారం ఉదయం వరకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.ఈ ఘటనపై కపుర్తలా ఎస్ఎస్‌పీ గౌరవ్ తూరా స్పందిస్తూ, అత్యాచారం లేదా ఆత్మహత్యకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు. "కొందరు విద్యార్థులు ఒక అమ్మాయి అత్యాచారానికి గురైందని, మరికొందరు ఆత్మహత్య చేసుకుందని ప్రచారం చేశారు. ప్రాథమిక విచారణలో ఈ ఆరోపణలను రుజువు చేసే ఆధారాలు లభించలేదు. ఇది కేవలం వదంతుల వల్లే జరిగిందని భావిస్తున్నాం" అని ఆయన తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌కు చేరుకుని విద్యార్థులతో చర్చలు జరిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చి, జాతీయ రహదారిపై రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఆందోళనలకు కారణమైన సోషల్ మీడియా పోస్టుల మూలాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

- జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ
- పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి
- జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్




తిరుపతి (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; జిల్లా కలెక్టరేట్ లో నేడు సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు అలాగే పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ నెల 28 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు మినహాయింపు: సీఎం విజయ్

**చెన్నై:** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా వర్గీకరిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా G.O. Ms.No.57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ నిర్ణయం వల్ల... ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు.

## హెచ్-1బీ వీసాలో భారీ మార్పులు.. ఏడాదిలో కొత్త రూల్స్!

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంటాయని స్పష్టం చేశారు. మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయని తెలిపారు. "అరెస్టులకు మేం సిద్ధంగా ఉన్నాం. వాస్తవాలను అమెరికా ప్రజల ముందు ఉంచుతున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు హెచ్-1బీ వీసా మోసాలపై ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉందో తెలియజేస్తున్నాయి.ఇప్పటికే కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం ఈ విచారణలో భాగంగా డజన్ల కొద్దీ సబ్‌పోనాలు జారీ చేయడంతో పాటు, పలు సంస్థల్లో సెర్చ్ వారెంట్లు కూడా అమలు చేసింది. ముఖ్యంగా క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా కాగ్నిజెంట్, క్లౌడెరా వంటి కొన్ని కంపెనీలకు సంబంధించిన వీసా దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేశారు. నకిలీ దరఖాస్తులు, వేతనాల్లో అవకతవకలు, కార్మికుల దోపిడీ, అమెరికన్ ఉద్యోగులను తొలగించడం వంటి అంశాలపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలు ప్రభుత్వ విస్తృత వ్యూహంలో భాగమని స్పష్టమవుతోంది. ఇప్పటికే కొంతమంది హెచ్-1బీ వర్కర్ల ప్రవేశంపై ఆంక్షలను పొడిగించిన ప్రభుత్వం, వీసా దరఖాస్తులను సమీక్షించేటప్పుడు కంపెనీలు గతంలో ఉద్యోగులను తొలగించిన చరిత్రను (లేఆఫ్స్) కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించింది. స్థానిక టెక్ ఉద్యోగాలను విదేశీ నిపుణులతో భర్తీ చేయకుండా నిరోధించేందుకు గతంలో 'ప్రాజెక్ట్ ఫైర్‌వాల్' వంటి కార్యక్రమాలను కూడా చేపట్టారు. కొన్ని కంపెనీలు, ఔట్‌సోర్సింగ్ సంస్థలు అమెరికన్ల వేతనాలను, ఉద్యోగాలను దెబ్బతీసేందుకు హెచ్-1బీ విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శకులు ఆరోపిస్తుండగా, దేశంలో నిపుణుల కొరతను తీర్చడానికి ఈ వీసా ఎంతో అవసరమని దాని మద్దతుదారులు వాదిస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుత దర్యాప్తులు, ప్రభుత్వ సంకేతాలను బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో హెచ్-1బీ విధానంలో కఠినమైన నిబంధనలు, నిర్మాణాత్మక సంస్కరణలు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

## అక్టోబరు 12 నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ స్పష్టం చేసింది.ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబరు 16న అత్యంత కీలకమైన గరుడ వాహన సేవ, అక్టోబరు 19న స్వర్ణరథం, అక్టోబరు 20న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. సాధారణంగా ఉదయం వాహన సేవలు 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు కన్నుల పండువగా జరగనుంది.

**నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:**

- అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)
- అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6:30 గంటలకు)
- అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)
- అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)
- అక్టోబరు 20వ తేదీ ఉదయం జరిగే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

## పల్లెల్లో అభివృద్ధి వెలుగులు





(మొదటిపేజీ తరువాయి)

ఏలూరి తెలిపారు. పాడి రైతులకు అండగా రూ.300 కోట్లతో 22 వేల మినీ గోకులాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రూ.225 కోట్లతో 50 వేల ఎకరాల్లో తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.రూ.110 కోట్లతో వెయ్యి కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు, రూ.200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర పనులు చేపట్టనున్నట్లు ఏలూరి వివరించారు. కేంద్ర వాటాగా రూ.5,391 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ.5,694 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.వీబీ--జీ రామ్ జీ కింద రూ.1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ.3,800 కోట్లు, నాబార్డ్, సాస్కీ తదితర నిధుల ద్వారా మరో రూ.2 వేల కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

**పల్లె పండుగతో మారుతున్న గ్రామాల రూపురేఖలు**

పల్లె పండుగ--1.0లో 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 22,514 పశువుల షెడ్లు, 21 వేల వ్యవసాయ పంట కుంటలు, 64 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం చేపట్టినట్లు ఏలూరి తెలిపారు. పల్లె పండుగ--2.0లో 2,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 8,300 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 15,750 పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయ కుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించినట్లు వివరించారు.ఇప్పుడు పల్లె పండుగ--3.0తో గ్రామాల్లో మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏలూరి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.భారీగా తరలిరావాలి.. ఎమ్మెల్యే ఏలూరి..

29న రామాపురంలో జరిగే పల్లె పండుగ--3.0 ప్రారంభ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జనసమీకరణను విజయవంతం చేయాలని సూచించారు.ఈసమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జోనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ దీదా రవిచంద్ర, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, కార్పొరేషన్ చైర్మన్ కె.కె.చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# పల్లె పండుగ 3.0 విజయవంతానికి శ్రేణులు సమాయత్తం కావాలి

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపు
- ఆత్మకూరులో టీడీపీ--జనసేన--బీజేపీ నాయకులతో మంత్రి ఆనం సమావేశం
- రామాపురం సభకు భారీ జనసమీకరణ..లక్ష మందితో భారీ బహిరంగ సభ
- మెట్ట ప్రాంతాల అభివృద్ధికి పల్లె పండుగ 3.0 వరం
- నెల్లూరు జిల్లా నుంచి వీబీ--జీ రామ్ జీ పథకానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకం

నెల్లూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా జరగనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎన్డీఏ కూటమి శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్‌లో కోఆర్డినేటర్ కొమ్మలపాటి శ్రీధర్ తో కలిసి ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులతో, అధికారులతో విడివిడిగా మంత్రి ఆనం ప్రత్యేక సమావేశం నిర్వహించి సభ ఏర్పాట్లు, జనసమీకరణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలు, కూటమి శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

### రామాపురంలో జరిగే పల్లె పండుగ 3.0

కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకంగా నిలిచేలా నిర్వహించాలని మంత్రి ఆనం సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. గ్రామాల వారీగా జనసమీకరణ, వాహనాల ఏర్పాటు, ప్రజలను సభా ప్రాంగణానికి తీసుకురావడం, తిరిగి సురక్షితంగా వారి గ్రామాలకు చేర్చడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పార్కింగ్, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని మంత్రి ఆనం స్పష్టం చేశారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### లక్ష మందితో భారీ బహిరంగ సభ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొనే రామాపురం సభకు భారీగా ప్రజలను తరలించి లక్ష మందితో భారీ బహిరంగ సభగా నిర్వహించేలా కూటమి శ్రేణులు కృషి చేయాలని మంత్రి ఆనం సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత వచ్చేలా పెద్దఎత్తున ప్రజల భాగస్వామ్యాన్ని కల్పించాలని కోరారు.

### మెట్ట ప్రాంతాలకు పల్లె పండుగ 3.0 వరం

ఉదయగిరి, ఆత్మకూరు వంటి మెట్ట ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి పల్లె పండుగ 3.0 ఎంతో కీలకమని మంత్రి ఆనం పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల కోసం ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, ఉద్యాన పంటలు, పశుసంపదకు సంబంధించిన వసతులు అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి పనులు

పల్లె పండుగ 3.0 కింద రాష్ట్రవ్యాప్తంగా రూ. 11,085 కోట్లతో భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో కేంద్ర వాటాగా రూ. 5,391 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ. 5,694 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు.రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ. 300 కోట్లతో పాడి రైతుల కోసం 22,000 మినీ గోకులాలు, రూ. 225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్లు, రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

### నెల్లూరు జిల్లా నుంచే వీబీ--జీ రామ్ జీ పథకానికి శ్రీకారం

గ్రామీణ ప్రాంతాల్లో రహదారి అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు వీబీ--జీ రామ్ జీ పథకం కింద భారీగా నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. వీబీ--జీ రామ్ జీ కింద రూ. 1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ. 3,800 కోట్లు, నాబార్డ్, సాస్కి, ఇతర నిధుల ద్వారా మరో రూ. 2,000 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అనుసంధానానికి 6,000 కిలోమీటర్ల మేర పనులు చేపట్టడంతో పాటు, తారు రోడ్ల నిర్మాణం, ఉద్యానవన ప్రాంతాలను అనుసంధానించే రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

### పల్లె పండుగ 1.0, 2.0తో గ్రామీణ ప్రాంతాల్లో మార్పు

పల్లె పండుగ 1.0 కింద 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 22,514 పశువుల షెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం చేపట్టినట్లు తెలిపారు.పల్లె పండుగ 2.0 కింద 2,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 8,300 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 15,750 పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయ కుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టినట్లు మంత్రి వివరించారు.

### కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధికి బాటలు

పల్లె పండుగ 3.0 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపడుతున్న భారీ గ్రామీణాభివృద్ధి కార్యక్రమమని మంత్రి ఆనం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు బలోపేతం కావడంతో పాటు రైతులు, పాడి రైతులు, ఉద్యాన రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు.

రామాపురం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణుల ఐక్యతను చాటాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. అన్ని మండలాలు, గ్రామాల నాయకులు సమన్వయంతో పనిచేసి పెద్దఎత్తున ప్రజలను సభకు తరలించాలని సూచించారు.ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండలాల నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొని పల్లె పండుగ 3.0 సభ ఏర్పాట్లు, జనసమీకరణ, రవాణా, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కొమ్మలపాటి శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పల్లెల్లో అభివృద్ధి వెలుగులు

- ఈ నెల 29న పల్లె పండుగ 3.0కి శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో భారీ ఎత్తున అభివృద్ధి పనులు
- రామాపురం నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా పనుల ప్రారంభం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; పల్లె పండుగ 3.0 కింద రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ. 11,085 కోట్లతో భారీ ఎత్తున అభివృద్ధి పనులను నెల్లూరు జిల్లా రామాపురం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.ఈ నెల 29న నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కింద పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ. 2,700 కోట్ల వ్యయంతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 7,550 కోట్ల వ్యయంతో 9,500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

పాడి రైతులకు మద్దతుగా రూ. 300 కోట్లతో 22,000 మినీ గోకులాల నిర్మాణం, రూ. 225 కోట్ల వ్యయంతో ఉద్యానవన శాఖ ద్వారా 50,000 ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ. 110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్లు, రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పల్లె పండుగ 3.0లో భాగంగా చేపట్టే మొత్తం రూ. 11,085 కోట్ల పనుల్లో కేంద్ర వాటాగా రూ. 5,391 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ. 5,694 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీబీ--జీ రామ్ జీ కింద రూ. 1,750 కోట్లు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద రూ. 3,800 కోట్లు, నాబార్డ్, సాస్కి, ఇతర నిధుల ద్వారా రూ. 2,000 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు.ఇప్పటికే పల్లె పండుగ 1.0 కింద 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 22,514 పశువుల షెడ్లు, 21,000 వ్యవసాయ పంట కుంటలు, 64 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా పల్లె పండుగ 2.0 కింద 2,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 8,300 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 15,750 పశువుల షెడ్లు, 15,500 పశువుల నీటి తొట్టెలు, 86 వేల వ్యవసాయ కుంటలు, 82 వేల వ్యక్తిగత సోక్ పిట్లు, 32 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఉద్యాన రంగాలకు ప్రోత్సాహం అందించేలా పల్లె పండుగ 3.0 కింద పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.



## సూర్యప్రభ వాహనం పై దేవాది దేవుడు గణనాథుడు

### ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సూర్య ప్రభ వాహనం సేవ పై దర్శనం ఇచ్చిన దేవాది దేవుడు గణనాథుడు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, మరియు ఈ.వో ఉభయదారులు, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి: కలెక్టర్ హిమాన్షు శుక్ల

### ఏ.ఎస్.ఎల్. నిర్వహణలో భాగంగా రామాపురం లో ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 29న (మంగళవారం) ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం రామాపురంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆదివారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఏఎస్ఎల్ (అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్) నిర్వహించి, పలు ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ముందుగా.. హెలిప్యాడ్ నుండి ప్రారంభం అయిన ఏ.ఎస్.ఎల్. కాన్వాయ్ ..కాకొల్లవారి పల్లె, ప్రజా వేదిక, తిరిగి హెలిప్యాడ్ కు చేరుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రాంతాలను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆత్మకూరు, కావలి ఆర్డీఓలు పావని, ఎలేష, జడ్పి సిఈఓ వసుమతి, డ్వామ పిడి శ్రీనివాస ప్రసాద్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ శాఖల ఇంజనీర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఫల సరుకులు పంపిణీ



గూడూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు ఆదివారం డాక్టర్ సి జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి దాతృత్వంతో నిరుపేదలైన 20 మందికి నెలకు సరిపడా పలసరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అధ్యక్షులు మండిశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా నిరుపేదలైన 20 మందికి నెలకు సరిపడా పలసరుకులు అందజేయడం జనార్దన్ రెడ్డి , రోహిణి సేవకు నిదర్శనమని, నిరుపేదలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యదర్శి దేశిరెడ్డి ప్రజేంద్ర రెడ్డి మాట్లాడుతూ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘ రాజ పోషకులుగా, ఉపాధ్యక్షులుగా జనార్దన్ రెడ్డి రోహిణి విశేష సేవలు అందించడం, క్రమం తప్పకుండా వృద్ధులకు సరుకులు అందజేయడం ఎంతో మంచి విషయమని తెలియజేశారు.

## స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా : బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్. సుబ్బారెడ్డి ఆదివారం శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అతిథులను ఆలయ మర్యాదలతో స్వాగతించి, అతిథుల గోత్రనామాలతో శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించి ,శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు అందజేశారు. ఆలయ అర్చకులు వేద పండితులు అతిథులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామంలో స్వయంభుగా వెలసి నిత్యం పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ ఈవో నవీన్ కుమార్ , చైర్మన్ దశరథ రామిరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.




## పల్లె పండుగ ను విజయవంతం చేయాలి

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి**

కందుకూరు , సింధూర దర్శిని; పల్లె పండుగ 3.0 ను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలం, రామాపురం గ్రామానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ,బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విచ్చేస్తున్న సందర్భంగా కందుకూరు నుండి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వెళ్ళే జనసమీకరణలో భాగంగా వల్లేటివారిపాళెం మరియు కందుకూరు పట్టణం నందు మండలపార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయఢంకా మోగించాలంటే 29న జరుగబోయే సభ నందు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని...అలాగే మన రాష్ట్ర ముఖ్యమంత్రి పల్లెలు,పట్టణాల్లో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం అందరికి తెలిసేవిధంగా మన కార్యాచరణ ఉండాలని వివరించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలిక రద్దు

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



నెల్లూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నందున ప్రజల నుంచి వినతులు స్వీకరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 28న తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## వ్యర్ధాల నుండి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ పరిశీలన కు అటవీ సంరక్షణ అధికారి



నెల్లూరు( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ పరిశీలనకు నెల్లూరుకు ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పర్యటన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/నోడల్ ఆఫీసర్ కె. బాలాజీ ప్రతిపాదిత వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను పరిశీలించేందుకు నెల్లూరును సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌కు సంబంధించిన స్థల పరిశీలనతో పాటు ప్రాజెక్టు ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ కె. బాలాజీ ని శనివారం మర్యాదపూర్వకంగా కలసి, నెల్లూరుకు విచ్చేసిన ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

# నెల్లూరులో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు

**రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ**



నెల్లూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరంలో రూ.3,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నగర సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మార్కెట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర పనులను వేగంగా చేపడుతున్నామని చెప్పారు.ఆదివారం నెల్లూరు నగరంలోని వివిధ డివిజన్లలో మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 4వ డివిజన్ కృష్ణవేణి స్కూల్ వీధిలో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, 7వ డివిజన్ వైవీఎం ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 9వ డివిజన్ నవాబుపేటలో రూ.60 కోట్లతో నిర్మించనున్న ఆధునిక మార్కెట్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2028 జూన్ 12 నాటికి నెల్లూరు నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12లోపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పనులను పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని, ప్రస్తుతం మళ్లీ నిధులు తీసుకువచ్చి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరాన్ని దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

నవాబుపేట మార్కెట్ యార్డులో రూ.60 కోట్లతో ఆధునిక మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తొలిదశలో రూ.13 కోట్లతో పనులు ప్రారంభిస్తామని, వ్యాపారులతో చర్చించి వారికి అనుకూలంగా నిర్మాణాలను చేపడతామని చెప్పారు.నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులతో పాటు స్విమ్మింగ్ పూల్స్ వంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలకు ముఖ్యమంత్రి రూ.50 వేల కోట్ల నిధులు అందించారని తెలిపారు.నెల్లూరులో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు ఓర్వలేక చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. అసత్య ఆరోపణలతో తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారి విమర్శలను ప్రజలు విశ్వసించరని చెప్పారు. తాను కూడా వాటిని పట్టించుకోనని స్పష్టం చేశారు.ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి తెలిపారు. పేదల అభ్యున్నతికి తన సొంత నిధులను కూడా ఖర్చు చేస్తున్నానని చెప్పారు. తాను సంపాదించాలని అనుకుంటే నారాయణ సంస్థల ద్వారా వేల కోట్లు సంపాదించుకోవచ్చని, వివిధ రాష్ట్రాల్లోని నారాయణ విద్యా సంస్థల్లో 6 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, లక్ష మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. విమర్శలు చేసే ముందు ఆలోచించుకోవాలని సూచించారు.మంత్రి వెళ్లిన ప్రతి ప్రాంతంలో స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రజలతో మమేకమైన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, కార్పొరేషన్ ఈఈ అనీల్ కుమార్, డీఈ శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాను పర్యాటక రంగంలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం




- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన విధానాలతో టూరిజం అభివృద్ధికి శ్రీకారం**
- **జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**

తిరుపతి( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లాను పర్యాటక రంగంలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శిల్పారామం లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం జయకృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆర్డి టూరిజం రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్దన్ రెడ్డి, ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ బాలాజీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాను పర్యాటక రంగంలో దేశంలోనే ఒక ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేయడానికి రెవెన్యూ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి అవసరమైన భూములన కేటాయించడానికి రెవెన్యూ శాఖ సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్ని భూములను ఇవ్వడంతో పాటు మరికొన్ని ముందస్తు చర్యల చేపట్టామన్నారు. తిరుపతి అంటేనే ఒక పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఇక్కడ ఆధ్యాత్మిక టెంపుల్ టూరిజంతో పాటు అటవీ శాఖ సహకారంతో ఈకో-టూరిజం కూడా విశేషంగా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ మరియు టూరిజం స్పెషల్ సీఎస్ (సి.ఎస్.), ఎండీ ల మార్గదర్శకత్వంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ నేతృత్వంలో సమగ్ర రోడ్‌మ్యాప్‌తో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సాధారణ రోజుల్లోనే రోజుకు 80,000 నుండి 90,000 మంది వరకు భక్తులు మరియు పర్యాటకులు తిరుపతికి వస్తుంటారని, చుట్టుపక్కల ఉన్న ఇతర దేవాలయాలు, పచ్చదనంతో కూడిన ప్రాంతాలను కలుపుకుని పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. అందరి ఉమ్మడి సహకారంతో తిరుపతి జిల్లా పర్యాటక రంగంలో సరికొత్త శిఖరాలను చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.తిరుపతి జిల్లాలో పర్యాటక రంగాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు "డిజిటల్ అజెండా – – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ త్రూ ఇన్సిడెంట్ టూరిజం" అనే థీమ్‌తో ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిని గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విస్తృత చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రస్తుతం తిరుపతికి వచ్చే పర్యాటకులు సగటున 18 గంటలు మాత్రమే ఉంటున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యాటకులను కనీసం 2 నుండి 3 రోజుల పాటు ఇక్కడే ఉండేలా ఆకర్షణీయమైన ప్యాకేజీలు, రంగాలను సిద్ధం చేస్తున్నారు. కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా అగ్రికల్చర్, ఈకో, బీచ్, ఎడ్యుకేషన్, సైన్స్, వెల్నెస్, మైస్ మరియు వెడ్డింగ్ డెస్టినేషన్ టూరిజం రంగాలుగా జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు. అమరావతితో పాటు తిరుపతిని గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఇందులో భాగంగా తిరుపతి అభివృద్ధికి రూ. 500 కోట్ల నిధులు రానున్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం ఒబెరాయ్, రాడిసన్, మ్యారియట్, ఎలిమెంట్స్, సి.ఆర్.ఆర్ (5-స్టార్), ఎసెన్షియా (3-స్టార్) వంటి ప్రముఖ హోటల్ శృంఖలాలు నూతన ప్రాజెక్టులను ప్రారంభించబోతున్నాయన్నారు. తిరుపతి, మెట్టుకంద్రిగ (రూ. 18 కోట్ల అభివృద్ధి ప్రాజెక్ట్), వెంకటగిరి చీరల క్లస్టర్, మాధవవరం ఉడ్ కార్వింగ్ ప్రాంతాలను టూరిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నాతన్నారు. దీని ద్వారా స్థానిక స్వయం సహాయక సంఘాలు, చేతివృత్తుల వారి ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రణాళికల ద్వారా జిల్లా స్థూల ఉత్పత్తి పెరగడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకా శాలు, వ్యాపార ప్రగతి కలగనున్నాయి. బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీపడుతూ తిరుపతిని అన్ని రంగాల పర్యాటక రంగానికి కేంద్ర బిందువుగా మార్చేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర ప్రణాళికతో ముందడుగు వేస్తున్నట్లు తెలియజేశారు.

# 1.80 కోట్లతో రెండు వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన

- **25-30 ఏళ్ల క్రితం కూలిపోయిన బ్రిడ్జిల నిర్మాణ పనులు ప్రారంభించడం సంతోషకరం**
- **జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవతోనే వంతెనల నిధులు మంజూరు**
- **బుచ్చిరెడ్డిపాళెం - జొన్నవాడ మధ్య 5 కిలోమీటర్ల ప్రయాణ దూరం**
- **ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



కోవూరు( సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కోవూరు కాలువపై దశాబ్దాలుగా కూలిపోయి మిగిలిపోయిన రెండు కీలక వంతెనల నిర్మాణ పనులకు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా దామరమడుగు, కాళాయకాగల్లు పంచాయతీల పరిధిలో రూ.1.80 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారీ మెజారిటీ అందించిన ప్రజల ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరారు.

### దశాబ్దాల కల నెరవేరుస్తున్నాం

దామరమడుగు పంచాయతీ పరిధిలో 2000 సంవత్సరంలో కూలిపోయిన బ్రిడ్జిని, కాళాయకాగల్లు పంచాయతీ పరిధిలో బెజవాడ గోపాల్‌రెడ్డి కాలంలో నిర్మించి దాదాపు 30 ఏళ్ల క్రితం పడిపోయిన బ్రిడ్జిని పునర్నిర్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఇన్నేళ్ల పాటు ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. ఈ రెండు బ్రిడ్జిల మంజూరు కోసం ప్రభుత్వం వద్దకు రెండుసార్లు ప్రతిపాదనలు తీసుకెళ్లామని, జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవ చూపించి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.

### రూ.1.80 కోట్లతో రెండు వంతెనల నిర్మాణం

దామరమడుగు పంచాయతీ వద్ద రూ.90 లక్షలతో నిర్మించే బ్రిడ్జి వల్ల పాటూరు, గుమ్మలదిబ్బ, ఎల్లాయపాళెం, కోవూరు, దామరమడుగు గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం పెరగడమే కాకుండా, రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకోవచ్చని తెలిపారు. అలాగే కాళాయకాగల్లు పంచాయతీ పరిధిలో రూ.90 లక్షలతో చేపట్టే మరో బ్రిడ్జి వల్ల సుమారు 400 ఎకరాల ఆయకట్టు రైతులకు, పెనుబల్లి, జొన్నవాడు, మినగల్లు, పంచేడు, సాల్మానుపురం గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయన్నారు.ప్రస్తుతం బుచ్చిరెడ్డిపాళెం నుంచి జొన్నవాడకు మినగల్లు మీదుగా వెళు_న్నారని, ఈ వంతెన పూర్తయితే కాగులపాడు మీదుగా ప్రయాణించే మార్గం అందుబాటులోకి వచ్చి దాదాపు 5 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలో రూ.850 కోట్ల అభివృద్ధి పనులు చేసుకోగలిగామని తెలిపారు. అంతేకాకుండా సెప్టెంబరు 29 నుంచి ప్రారంభమయ్యే 'పల్లె పండుగ 3.0' కింద మరో రూ.10 కోట్లు కోవూరుకు మంజూరయ్యాయని, వాటి పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.నాణ్యతా ప్రమాణాలు పాటించాలివంతెనల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అలాగే స్థానికులు కోరిన డ్రెయిన్లు, ఇతర సమస్యల పరిష్కారానికి ఇప్పటికే రూ.35 లక్షలు బదిలీ చేశామని, త్వరలోనే డ్రెయిన్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

# భోజనం తర్వాత ఛాతీలో మంట.. గ్యాస్ నొప్పి, గుండె నొప్పి మధ్య తేడా ఇదే!



భోజనం తర్వాత వచ్చే ఛాతీ నొప్పిని ఎప్పుడూ యాసిడిటీ అని కొట్టిపారేయొద్దంటున్న నిపుణులు గుండెపోటులో నొప్పి కన్నా ఒత్తిడి, బరువుగా అనిపించడం వంటి లక్షణాలు చెమటలు, ఆయాసం, వాంతులు వంటివి కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి మహిళలు, మధుమేహ రోగుల్లో విలక్షణమైన, బలహీనమైన లక్షణాలు కనిపించే ఛాన్స్ స్వయంగా నిర్ధారించుకోకుండా వెంటనే ఆసుపత్రికి వెళ్లడం ముఖ్యమంటున్న నిపుణులు

భోజనం చేసిన తర్వాత ఛాతీలో కాస్త నొప్పిగా, మంటగా అనిపిస్తే చాలామంది దాన్ని గ్యాస్ సమస్య లేదా యాసిడిటీ అని తేలిగ్గా తీసుకుంటారు. ఇది సాధారణమే అయినప్పటికీ, కొన్నిసార్లు ఇది ప్రాణాంతకమైన గుండెపోటుకు తొలి సంకేతం కావచ్చు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధుల ముప్పు ఉన్నవారిలో ఈ అనుమానం మరింత బలపడుతుంది. గ్యాస్ నొప్పికి, గుండె నొప్పికి మధ్య తేడాలు కొన్నిసార్లు చాలా అస్పష్టంగా ఉంటాయి. అందుకే ఈ రెండింటి లక్షణాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### యాసిడిటీ లేదా గుండెల్లో మంట లక్షణాలు ఎలా ఉంటాయి?

సాధారణంగా కడుపులోని యాసిడ్, అన్నవాహికలోకి పైకి ఎగదన్నడం వల్ల గుండెల్లో మంట వస్తుంది. దీనివల్ల ఛాతీ మధ్యభాగంలో మంటగా అనిపిస్తుంది. ఈ మంట కొన్నిసార్లు గొంతు వరకు పాకుతుంది. గొంతులోకి చేదుగా లేదా పుల్లగా ఏదో వచ్చినట్లు అనిపించడం, తేన్పులు, కడుపు ఉబ్బరంగా ఉండటం దీని ప్రధాన లక్షణాలు. ముఖ్యంగా ఎక్కువ తిన్నప్పుడు, తిన్న వెంటనే పడుకున్నప్పుడు ఈ లక్షణాలు తీవ్రమవుతాయి.

### గుండెపోటు లక్షణాలను ఎలా గుర్తించాలి?

గుండెపోటులో కలిగే అసౌకర్యం కేవలం మంటలా కాకుండా ఛాతీ మధ్యలో తీవ్రమైన ఒత్తిడి, బరువు పెట్టినట్లు, ఎవరో నలిపేస్తున్నట్లు లేదా పట్టేసినట్లు ఉంటుంది. ఈ నొప్పి కొన్ని నిమిషాల పాటు ఉండి, తగ్గిపోయి మళ్లీ రావచ్చు లేదా క్రమంగా తీవ్రం కావచ్చు. ఇది కేవలం ఛాతీకే పరిమితం కాకుండా ఒకటి లేదా రెండు చేతులకు, వీపు, మెడ, దవడ, భుజాలు లేదా పొత్తికడుపు పైభాగానికి కూడా వ్యాపిస్తుంది. దీనితో పాటు ఆయాసం, విపరీతమైన చెమటలు, వాంతి, వికారం, తల తేలిపోవడం, అసాధారణమైన అలసట లేదా గుండె లయ తప్పడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, మధుమేహ రోగులలో ఛాతీ నొప్పి లేకుండానే కేవలం విపరీతమైన అలసట, ఆయాసం, దవడ నొప్పి వంటి విలక్షణమైన లక్షణాలు కూడా కనిపించవచ్చు.

### ఎప్పుడు అప్రమత్తం కావాలి?

గుండెల్లో మంటకు, గుండెపోటుకు మధ్య తేడాను తెలుసుకోవడానికి ప్రజలు సొంతగా చేసుకోగల నమ్మకమైన పరీక్ష ఏదీ లేదు. గతంలో వచ్చినట్లే కదా అని తేలికపాటి నొప్పిని కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఎందుకంటే గుండెపోట్లు కొన్నిసార్లు అజీర్తి లక్షణాలతో నెమ్మదిగా మొదలవుతాయి. ధూమపానం, అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అయితే, ఈ రిస్క్ ఫ్యాక్టర్లు ఏవీ లేనంత మాత్రాన గుండెపోటు రాదని చెప్పలేం.కొత్తగా, కారణం లేకుండా ఛాతీలో అసౌకర్యం మొదలైతే, అది కొన్ని నిమిషాలకు మించి కొనసాగితే, నొప్పి ఇతర భాగాలకు పాకుతున్నా, లేదా దానితో పాటు ఆయాసం, చల్లటి చెమటలు, వికారం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. స్వంతగా నిర్ధారణ చేసుకునే ప్రయత్నం ప్రాణాలకే ప్రమాదం. ఆసుపత్రిలో వైద్యులు ఈసీజీ, అధిక సున్నితత్వ ట్రోపోనిన్ వంటి రక్త పరీక్షల ద్వారా అది గుండెపోటా కాదా అని నిర్ధారిస్తారు. గుండెపోటుకు ఎంత త్వరగా చికిత్స అందిస్తే, గుండె కండరానికి జరిగే నష్టాన్ని అంతగా తగ్గించవచ్చు. తరచుగా భోజనం తర్వాత మంట వస్తుంటే, దానికి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవచ్చు. కానీ, కొత్తగా లేదా పైన చెప్పిన లక్షణాలతో కూడిన నొప్పి వస్తే, అది గుండె సంబంధిత సమస్య కాదని వైద్యులు నిర్ధారించే వరకు అప్రమత్తంగా ఉండటం అత్యంత ముఖ్యం.

# రియల్ జాక్‌పాట్ అంటే ఇదే.. రూ.500తో లాటరీ టికెట్ కొంటే రూ.30కోట్లు!

- కేరళ తిరువోణం బంపర్ లాటరీలో రూ. 30 కోట్ల మొదటి బహుమతి
- రూ. 360615 నంబర్ గల టిక్కెట్‌కు దక్కిన జాక్‌పాట్
- కన్నూర్‌లోని ఓ ఏజెన్సీలో అమ్ముడైన అదృష్ట టిక్కెట్
- చరిత్రలో తొలిసారిగా 90 లక్షల టిక్కెట్లు అమ్ముడై రికార్డ్
- విజేతకు పన్నులు పోను మిగిలిన మొత్తమే అందజేత




**కేరళ:** కేరళలో ప్రతి ఏటా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసే తిరువోణం బంపర్ లాటరీ (బీ=-111) ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది ఏకంగా రూ. 30 కోట్ల భారీ జాక్‌పాట్‌ను ఒక అదృష్టశాలి గెలుచుకున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో ఈ లాటరీ డ్రాను నిర్వహించారు. ఈ డ్రాలో రూ. 360615 నంబర్ గల టిక్కెట్‌కు మొదటి బహుమతి లభించింది. ఈ అదృష్ట టిక్కెట్‌ను కన్నూర్ జిల్లా చక్కరక్కల్ ప్రాంతానికి చెందిన ముత్తు లాటరీ ఏజెన్సీ (ఏజెంట్ అనీష్) విక్రయించినట్లు అధికారులు తెలిపారు.ఈసారి ఓణం బంపర్ లాటరీకి కేరళ ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. లాటరీ శాఖ రూ. 500 ధరతో మొత్తం 90 లక్షల టిక్కెట్లను ముద్రించగా, అన్నీ అమ్ముడుపోయాయి. ఈ డ్రా చరిత్రలో టిక్కెట్లన్నీ అమ్ముడుపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీని ద్వారా ప్రభుత్వానికి టిక్కెట్ల అమ్మకాల రూపంలోనే రూ. 450 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ విజయం కేరళ రాష్ట్ర లాటరీల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.మొదటి బహుమతే కాకుండా రెండో బహుమతిగా 20 మందికి తలా రూ. 1 కోటి చొప్పున బహుమతులు దక్కాయి. TA 957486, TB 642974, TC 810428 వంటి నంబర్లకు ఈ బహుమతులు లభించాయి. ఇవి కాకుండా రూ. 25 లక్షల నుంచి రూ. 500 వరకు అనేక ఇతర బహుమతులు కూడా ఉన్నాయి. వీటికి సంబంధించిన పూర్తి జాబితాను లాటరీ విభాగం అధికారికంగా విడుదల చేయనుంది.అయితే, విజేతకు ప్రకటించిన రూ. 30 కోట్లు పూర్తిగా చేతికి రావు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, లాటరీ బహుమతులపై పన్ను, సర్‌ఛార్జ్, సెస్ వంటివి మినహాయిస్తారు. ఈ కోతలన్నీ పోను మిగిలిన మొత్తాన్ని మాత్రమే విజేతకు అందజేస్తారు. ప్రస్తుతం మొదటి బహుమతి గెలుచుకున్న వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. విజేత తన అసలు టిక్కెట్‌తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించి, నగదును క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఓణం పండుగ సందర్భంగా నిర్వహించే ఈ బంపర్ డ్రా కేరళలో అత్యంత ప్రజాదరణ పొందిన లాటరీలలో ఒకటిగా పేరుగాంచింది.

# ఆసియా క్రీడల్లో ముగిసిన సింధు పోరాటం.. చైనా షట్లర్ చేతిలో ఓటమి



ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత పతక ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్‌లో పోరాడి ఓటమి పాలవ్వడంతో వ్యక్తిగత విభాగాల్లో భారత్ ప్రస్థానం ముగిసింది. చైనా క్రీడాకారిణి చెన్ యుఫీతో జరిగిన హోరాహోరీ పోరులో సింధు 21-11, 18-21, 10-21 తేడాతో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ గెలిచి ఆశలు రేకెత్తించినా, ఆ తర్వాత ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ముఖ్యంగా చివరి గేమ్ లో ప్రత్యర్థి జోరు ముందు సింధు నిలవలేకపోయింది. ఈ ఓటమితో ఐచీ-నగోయా ఆసియా క్రీడలు 2026లో భారత బ్యాడ్మింటన్ ప్రస్థానం నిరాశజనకంగా ముగిసింది. ఈ క్రీడల్లో భారత్ కేవలం ఒక్క కాంస్య పతకంతోనే సరిపెట్టుకుంది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో లభించిన ఈ కాంస్యమే ఈసారి ఏకైక పతకంగా మిగిలింది. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సహా ఏ ఒక్క వ్యక్తిగత విభాగంలోనూ భారత షట్లర్లు పతకం సాధించలేకపోయారు. సింధుతో పాటు యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా కూడా క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. జపాన్‌కు చెందిన అకానే యమగూచితో జరిగిన మ్యాచ్‌లో ఉన్నతి ఓడింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే తమ పోరాటాన్ని ముగించాయి.ఈ టోర్నీలో భారత్‌కు అతిపెద్ద షాక్ డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రూపంలో తగిలింది. పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతక ఫేవరెట్లుగా బరిలోకి దిగిన ఈ జోడీ, రౌండ్ ఆఫ్ 32లోనే థాయ్‌లాండ్ జంట చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లోనూ లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి వంటి ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరకముందే నిష్క్రమించారు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల తర్వాత వ్యక్తిగత విభాగాల్లో భారత షట్లర్లు పతకం సాధించడంలో విఫలమవడం ఇదే తొలిసారి. గతంలో 2023 హాంగ్‌జౌలో మూడు పతకాలు సాధించిన భారత్, ఈసారి కేవలం ఒక్క కాంస్యంతోనే వెనుదిరగడం క్రీడాభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.



## భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతి.. పరీవాహక ప్రాంతాలకు హెచ్చరిక

- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- 8-9 లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద
- ప్రభావిత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మోహరింపు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాజ్‌వేలు దాటవద్దని హెచ్చరిక

భద్రాచలం, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్: భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి 8 నుంచి 9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరింది. కూనవరం వద్ద 14.8 మీటర్లు, పోలవరం వద్ద 9.98 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5.61 లక్షల క్యూసెక్కులుగా కొనసాగుతోంది. వరద గరిష్ఠ స్థాయికి చేరిన అనంతరం క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు.వరద ప్రభావిత జిల్లాల్లో అత్యవసర సహాయక చర్యల నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద ప్రమాదకర ప్రయాణాలు చేయవద్దని ఆయన ప్రజలను హెచ్చరించారు.

## ఏపీలో కరోనా శకం ముగిసినట్టేనా?.. మంత్రి సత్యకుమార్ కీలక ప్రకటన

- గత 33 రోజులుగా ఏపీలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదన్న మంత్రి
- ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ కేసులు ఏవీ లేవని ప్రకటన
- గత 94 రోజుల్లో 78 మందికి పాజిటివ్
- పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామన్న మంత్రి



అమరావతి, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్: రాష్ట్రంలో గత 33 రోజులుగా ఒక్క కొత్త కరోనా కేసు కూడా నమోదు కాలేదని, ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య సున్నాకు చేరుకుందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ఈ పరిణామంతో రాష్ట్రం కరోనా మహమ్మారి నుండి దాదాపుగా విముక్తి పొందినట్లయింది.శనివారం మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఒక్క పాజిటివ్ కేసు కూడా వెలుగు చూడలేదని ఆయన తెలిపారు. దీంతో వైద్యారోగ్య శాఖ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.గత మూడు నెలల గణాంకాలను పరిశీలిస్తే.. జూన్ 24 నుంచి సెప్టెంబర్ 25 వరకు (94 రోజులు) రాష్ట్రవ్యాప్తంగా 1,086 కరోనా నమూనాలను పరీక్షించగా, కేవలం 78 మందికి మాత్రమే వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని మంత్రి వివరించారు. వీరిలో 74 మంది ఇప్పటికే పూర్తిగా కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ 94 రోజుల్లో ఏకంగా 66 రోజుల పాటు సున్నా కేసులు నమోదు కావడం గమనార్హం.రాష్ట్రంలో ఎక్కడా కూడా కరోనా కేసులు సమూహాలుగా (క్లస్టర్లుగా) నమోదైన దాఖలాలు లేవని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## మూడు రోజులు బ్యాంకులు సమ్మె




గూడూరు (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ఆర్బీఐ ఆదేశాలతో గూడూరు పట్టణంలో బ్యాంకులు పనిచేసాయి. ప్రజలు తమ ఆర్థిక లావాదేవీలు జరుపుకున్నారు. సోమవారం నుండి మూడు రోజులపాటు బ్యాంకు ఉద్యోగాలు సమ్మె నిర్వహించనున్నారు. సోమవారం నుండి మూడు రోజులపాటు బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆర్బీఐ ఆదివారం బ్యాంకులు పనిచేయాలని ఆదేశించడంతో గూడూరు పట్టణంలో అన్ని బ్యాంకులు పనిచేశాయి. బ్యాంకు ఉద్యోగి మన్నన్ అహ్మద్ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని అనేక రోజులుగా డిమాండ్ చేస్తున్నామని ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక శాఖ పట్టించుకోవడం లేదని అన్నారు. ఐదు రోజుల పని దినాల డిమాండ్తో సోమవారం నుండి మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె నిర్వహిస్తున్నామని ప్రజలందరూ సహకరించాలని కోరారు.



## సాంబారులో బల్లి.. ఆసుపత్రి పాలైన 19 మంది విద్యార్థినులు

- తుని ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్‌లో ఘటన
- భోజనం తిన్న 19 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన వైనం
- బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు
- విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు

తుని (సింధూర దర్శిని) 20 సెప్టెంబర్: తూర్పుగోదావరి జిల్లా తునిలో విషాహారం ఘటన కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలో వండిన సాంబారులో బల్లి పడటంతో 19 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నిన్న మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కళాశాల హాస్టల్‌లో నివసిస్తున్న 49 మంది విద్యార్థినులు నిన్న మధ్యాహ్నం భోజనం చేశారు. భోజనం చేసిన కాసేపటికే 19 మంది విద్యార్థినులకు కడుపునొప్పి ప్రారంభమైంది. అనుమానంతో వారు సాంబారు గిన్నెను పరిశీలించగా, అందులో చనిపోయిన బల్లి కనిపించడంతో విద్యార్థినులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ వెంటనే స్పందించి వైద్యులకు సమాచారం అందించారు. సాయంత్రం సమయానికి విద్యార్థినులకు కడుపునొప్పి తీవ్రం కావడంతో వారిని హుటాహుటిన తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేశ్వరరావు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా రాత్రంతా వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. టీడీపీ నాయకులు యనుగంటి సత్యనారాయణ, మోదుకూరి వెంకటేశ్, మళ్ల గణేశ్ తదితరులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

## మూడు గోల్ఫ్ బంతులు మింగేసిన పాము ఆపరేషన్ లేకుండానే కాపాడిన వైద్యులు

- టెక్సాస్‌లో చికిత్స అందించిన పశువైద్యులు



- ఆపరేషన్ లేకుండానే బంతులను బయటకు తీసిన వైనం
- పాముకు అధిక మోతాదులో మత్తు ఇచ్చి చికిత్స పూర్తి చేసిన వైద్యులు
- ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్

**టెక్సాస్:** అమెరికాలో ఒక వింత ఘటన చోటుచేసుకుంది. ఓ పాము మూడు గోల్ఫ్ బంతులను మింగేయగా, పశువైద్యులు ఆపరేషన్ లేకుండానే వాటిని సురక్షితంగా బయటకు తీశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఓ పాము కడుపులో గోల్ఫ్ బంతులు ఇరుక్కుపోయి ఉండటంతో దానిని సౌత్ టెక్సాస్ ఏవియన్ అండ్ ఎగ్జాటిక్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పామును పరీక్షించిన వైద్యులు, దానికి అధిక మోతాదులో మత్తు ఇచ్చారు. అనంతరం దాని శరీరం లోపల ఇరుక్కుపోయిన మూడు బంతులను వైద్య బృందం నెమ్మదిగా చేతులతోనే నెట్టుకుంటూ నోటి వైపునకు తీసుకొచ్చింది. ఒక్కో బంతి నోటి వద్దకు రాగానే, పాము నోరు తెరుచుకోవడంతో వైద్యులు సులభంగా వాటిని బయటకు తీశారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సర్జరీ లేకుండానే విజయవంతంగా పూర్తి చేశారు. ఇది తమకు ఎప్పటికీ గుర్తుండిపోయే కేసు అని, అరుదైన జంతువులకు వైద్యం చేసేటప్పుడు ఇలాంటి ఊహించని కేసులు ఎదురవుతుంటాయని హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. ఈ చికిత్సకు సంబంధించిన వీడియోను హాస్పిటల్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకోగా, అది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. రూ.3,160 పతనమైన బంగారం

- అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో తగ్గుదల
- హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,680
- కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరిక

దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు గత వారం రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన వారం రోజుల్లోనే 10 గ్రాముల బంగారం ధరపై ఏకంగా రూ.3,160 మేర తగ్గుదల నమోదైంది. పసిడితో పాటు వెండి ధరలు సైతం ఇదే బాటలో పయనిస్తున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చనే అంచనాలు బలపడటంతో పాటు, యూఎస్ ట్రెజరీ బాండ్ల రాబడి పెరగడం వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారం నుంచి వైదొలుగుతున్నారు. దీనికి తోడు దేశీయంగానూ డిమాండ్ కొంత మందగించడంతో ధరలు దిగివచ్చాయి. ఆదివారం ఉదయం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,680గా నమోదు కాగా, 22 క్యారెట్ల ధర రూ.1,39,950 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,14,510గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.2.50 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, తిరుపతి వంటి ప్రాంతాల్లోనూ దాదాపు ఇవే ధరలు అమల్లో ఉన్నాయి.

## చిట్టీల పేరుతో మోసం.. రూ.10 కోట్లతో పరారైన ప్రభుత్వ టీచర్



- సూర్యాపేట జిల్లాలో ఘటన
- కుటుంబంతో కలిసి పరారు కావడంతో వెలుగులోకి
- 12 గ్రామాల ప్రజలు, బంధువుల నుంచి భారీగా డబ్బు సేకరణ
- పక్కా ప్లాన్‌తో భూములు అమ్మి, హైదరాబాద్‌లో డ్రామా ఆడి పరారీ

సూర్యాపేట, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్: చిట్టీల పేరుతో ప్రజల నుంచి రూ.10 కోట్లకు పైగా వసూలు చేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుటుంబం కలిసి పరారైన ఘటన సూర్యాపేట జిల్లాలో కలకలం రేపింది. బాధితులు జిల్లా ఎస్పీ నరసింహను కలిసి ఫిర్యాదు చేయడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. చివ్వెంల మండలం ఏనెగండి తండాకు చెందిన ఓ వ్యక్తి, ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నాడు. సూర్యాపేటలోని విద్యానగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తూ, ఆరేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. తన సొంత తండాతో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు, బంధువులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వద్ద నమ్మకంగా ఉంటూ డబ్బులు కట్టించుకున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.1.30 కోట్ల వరకు వసూలు చేశాడు. కొందరికి ప్రామిసరీ నోట్లు రాసి ఇవ్వగా, మరికొందరికి నెలవారీగా అధిక లాభాలు ఇస్తానని నమ్మించాడు. ఇలా రూ.10 కోట్లకు పైగా సమీకరించాడు. అయితే, ఏడాదిగా డబ్బులు తిరిగి చెల్లించాలని బాధితులు ఒత్తిడి చేస్తుండటంతో వాయిదాలు వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే, పరారయ్యేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. తనకున్న 4 ఎకరాల భూమిలో ఎక్కువ భాగాన్ని ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించి, తన పేరిట కేవలం 13 గుంటలు మాత్రమే ఉంచుకున్నాడు. సుమారు పది రోజుల క్రితం, హైదరాబాద్‌లో ఓ ముఖ్యమైన వ్యక్తిని కలవాలని చెప్పి ఇద్దరు గ్రామస్థులను తనతో తీసుకెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో కూర్చుని తాను అప్పుల్లో కూరుకుపోయానని చెప్పి, ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు, సూర్యాపేట, తండాలోని అతడి ఇళ్లకు వెళ్లి చూడగా తాళాలు వేసి ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆ డబ్బును ఏం చేశాడనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## కేర్ సెంటర్‌లో మాజీ క్రికెటర్ కాంబ్లీ.. ఇంటికి తీసుకెళ్లిన భార్య

- మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ వీడియో సోషల్ మీడియాలో వైరల్
- థానే కేర్ సెంటర్‌లో ఆయన మాట్లాడిన తీరుపై అభిమానుల ఆందోళన
- తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వెల్లడించిన సన్నిహితులు
- కాంబ్లీని ఇంటికి తీసుకెళ్లినట్లు స్పష్టం చేసిన కేర్ సెంటర్ నిర్వాహకులు
- ఆయనకు ఎప్పుడైనా ఉచితంగా చికిత్స అందిస్తామని ప్రకటన



**ముంబాయి:** భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. థానేలోని ఓ వృద్ధాశ్రమ సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతున్న సమయంలో తీసిన ఈ వీడియోలో ఆయన మాట్లాడటానికి ఇబ్బంది పడుతుండటం అందరినీ కలవరపరిచింది. అయితే, కాంబ్లీని ఆయన భార్య ఇంటికి తీసుకెళ్లినట్లు కేర్ సెంటర్ వ్యవస్థాపకులు తాజాగా స్పష్టతనిచ్చారు. సెప్టెంబర్ 25న బయటకు వచ్చిన ఈ వీడియోలో, కాంబ్లీ థానేలోని 'నిదాన్ సెంటర్ ఫర్ ఎల్డర్లీ కేర్'లో కనిపించాడు. "నేను ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాను. ఇక్కడి సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయి. వాళ్ల ప్రేమ, గౌరవం చూస్తుంటే ఇంటికి దూరంగా ఉన్న భావన కలగడం లేదు" అని కాంబ్లీ అన్నాడు. అయితే, ఆయన మాటలు స్పష్టంగా లేకపోవడం, నెమ్మదిగా మాట్లాడటం ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలను రేకెత్తించింది. సచిన్ టెండూల్కర్‌కు చిన్ననాటి స్నేహితుడైన వినోద్ కాంబ్లీ, 1990లలో భారత జట్టులో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. అయితే, గత కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2024 చివర్లో యూరినరీ ఇన్‌ఫెక్షన్, కండరాల బలహీనత, మెదడులో రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలతో ఆసుపత్రిలో చేరారు. ఆయనకు మధుమేహం, జ్ఞాపకశక్తి సమస్యలతో పాటు నడవడానికి కూడా ఇబ్బందులు ఉన్నాయని సన్నిహితులు గతంలో తెలిపారు. ఈ వీడియో వైరల్ అయిన నేపథ్యంలో నిదాన్ సెంటర్ వ్యవస్థాపకుడు మహేశ్ నాయక్ స్పందించారు. "కాంబ్లీ గతంలో 5-6 నెలలు మా దగ్గర ఉన్నారు. ఫిజియోథెరపీతో కోలుకున్నారు. ఇప్పుడు కూడా చికిత్స అందించాం. ప్రస్తుతం ఆయన భార్య ఇంటికి తీసుకెళ్లారు. ఆయన ఎప్పుడైనా తిరిగి రావచ్చు, చికిత్స ఖర్చులు మేమే భరిస్తాం. అతను మా హీరో" అని నాయక్ వివరించారు. కాంబ్లీ సహాయం లేకుండా నడవలేని స్థితిలో ఉన్నట్లు కూడా ఆయన తెలిపారు. ఈ వీడియో చూసిన అభిమానులు, కాంబ్లీ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షిస్తున్నారు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం.. దర్యాప్తులో భాగస్వామ్యం కోరుతున్న పైలట్లు

- ఏఐ-171 విమాన ప్రమాద నివేదిక సమీక్షలో తమకు పాత్ర కల్పించాలని పైలట్ల సంఘం డిమాండ్
- మంత్రి రామ్మోహన్ నాయుడికి ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ లేఖ
- స్వతంత్ర కమిటీ వేస్తే అందులో తమను సాంకేతిక భాగస్వాములుగా చేర్చాలని విజ్ఞప్తి
- గతేడాది జరిగిన ఈ ప్రమాదంలో 260 మంది మృతి



**ఢిల్లీ:** గతేడాది దేశవ్యాప్తంగా తీవ్ర విషాదం నింపిన ఎయిర్ ఇండియా ఏఐ-171 విమాన ప్రమాద ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన తుది దర్యాప్తు నివేదికను ఖరారు చేసే ముందు, తమ సాంకేతిక సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్' (ఎఫ్ఐపీ) కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి శుక్రవారం ఒక లేఖ రాసింది. ఈ నివేదికను సమీక్షించేందుకు ప్రభుత్వం ఏదైనా స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తే, అందులో తమను 'స్వతంత్ర సాంకేతిక భాగస్వామి'గా చేర్చాలని కూడా ఆ లేఖలో విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం లేదా మంత్రిత్వ శాఖ ఈ ముసాయిదా నివేదికను ఒక స్వతంత్ర కమిటీతో సమీక్షించాలని భావిస్తున్నట్లు తమకు విశ్వసనీయ సమాచారం అందిందని ఎఫ్ఐపీ తన లేఖలో పేర్కొంది. పైలట్ల వృత్తిపరమైన సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున, ఈ ప్రక్రియలో తమకు అధికారికంగా చోటు కల్పించాలని కోరింది. అయితే, ఎఫ్ఐపీ లేఖపై పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ గానీ, 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (ఏఏఐబీ) గానీ తక్షణమే స్పందించలేదు. 2025, జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ గ్యాట్విక్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ (ఏఐ-171) విమానం, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ ఘోర దుర్ఘటనలో విమానంలో ఉన్న 241 మంది, విమానం కూలిన ప్రదేశంలో నేలపై ఉన్న మరో 19 మందితో సహా మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పెను ప్రమాదం నుంచి కేవలం ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాద దర్యాప్తులో భాగంగా బోయింగ్ 787 విమానాల్లోని ఎలక్ట్రికల్ వ్యవస్థకు సంబంధించిన ఆధారాలను సమగ్రంగా విశ్లేషించాలని గత వారమే ఎఫ్ఐపీ, దర్యాప్తు సంస్థ ఏఏఐబీని కోరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రమాదంపై దర్యాప్తు చివరి దశలో ఉందని, అవసరమైన అన్ని కార్యకలాపాలు, అంతర్జాతీయ సంప్రదింపులు పూర్తయిన తర్వాత తుది నివేదికను విడుదల చేస్తామని ఏఏఐబీ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో పైలట్ల సంఘం లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది.

## హెచ్-1బీ వీసాతో అమెరికాలో కోటీశ్వరుడైన భారతీయుడు



**అమెరికా:** అమెరికాలో హెచ్-1బీ వీసాపై ఉన్న ఓ ప్రవాస భారతీయుడు కోటీశ్వరుడిగా మారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. డిజిటల్ కంటెంట్ క్రియేటర్ అయిన ప్రితేష్ జగానీ, తాను ఈ మైలురాయిని ఎలా చేరుకున్నాడో వివరిస్తూ తన ప్రయాణాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఇది ఏదో రాత్రికి రాత్రే వచ్చిన అదృష్టం కాదని, ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను నియంత్రించుకుంటూ, ఒక పద్ధతి ప్రకారం ముందుకు సాగడం వల్లే సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "హెచ్-1బీ వీసాపై కోటీశ్వరుడిగా మారడం అనేది ఏదో ఒక్క అదృష్ట పెట్టుబడితో సాధ్యం కాలేదు. పటిష్టమైన ఆర్థిక పునాది, ఖర్చుల నియంత్రణ, అప్పులు తీర్చడం, పన్ను ప్రయోజనాలున్న ఖాతాలను ఉపయోగించుకోవడం, నిరంతరం పెట్టుబడులు పెట్టడం వల్లే ఇది సాధ్యమైంది" అని జగానీ వివరించారు. అమెరికా వెళ్లిన తొలినాళ్లలో తన లక్ష్యం కేవలం మనుగడ సాగించడమేనని ఆయన తెలిపారు. దీనికోసం ఒక సాధారణ బడ్జెట్, మూడు నుంచి ఆరు నెలలకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకున్నానని, రోజువారీ ఆర్థిక వ్యవహారాలను అదుపులో ఉంచుకోవడంపైనే దృష్టి సారించానని పేర్కొన్నారు. అమెరికాలోని ఆర్థిక వ్యవస్థలను అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టినట్లు జగానీ చెప్పారు. "క్రెడిట్ స్కోర్ పెంచుకోవడం, ఆరోగ్య బీమా గురించి తెలుసుకోవడం, ఇంటికి డబ్బు పంపడం వంటివి నిర్వహించాను. జీతం పెరిగినప్పుడు, అనవసరంగా జీవనశైలిని మార్చుకోలేదు (లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్). విద్యా రుణం పూర్తిగా చెల్లించి, 401(కె) వంటి రిటైర్‌మెంట్ పథకాలలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాను" అని అన్నారు. సంపద పెరిగినప్పటికీ, అనవసర ఖర్చులకు దూరంగా ఉంటూ ఆ మిగిలిన డబ్బును పెట్టుబడులకు మళ్లించినట్లు తెలిపారు. ఖర్చులను తగ్గించుకోవడం కన్నా.. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం (అప్‌స్కిల్లింగ్), వ్యూహాత్మకంగా ఉద్యోగాలు మారడం తన సంపద పెరుగుదలపై ఎక్కువ ప్రభావం చూపాయని జగానీ స్పష్టం చేశారు. "అమెరికాలో హెచ్-1బీ వీసాపై ఉంటూ సంపద సృష్టించాలనుకునే వారు రెండు విషయాలపై దృష్టి పెట్టాలి. ఒకటి, ఉద్దేశపూర్వకంగా ఖర్చు చేయడం. రెండు, సంపాదన శక్తిని నిరంతరం పెంచుకోవడం.

# శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు ఆ పేరు ఎలా వచ్చింది?.. దీని వెనుక ఉన్న ఆసక్తికర కథ ఇదే!

- భారత తొలి ప్రధాని నెహ్రూ శతజయంతి గుర్తుగా శతాబ్ది రైళ్ల ప్రారంభం
- 'శతాబ్ది' అంటే వందేళ్ల కాలం లేదా శతకం అని అర్థం
- 1988లో మాధవరావు సింధియా హయాంలో ప్రారంభమైన తొలి శతాబ్ది రైలు
- ఇవి పగటిపూట మాత్రమే నడిచే ప్రీమియం రైళ్లు.. నో స్లీపర్ కోచ్‌లు
- సామాన్యుల కోసం అందుబాటులోకి తక్కువ ధరలకే 'జన్ శతాబ్ది' రైళ్లు




భారతీయ రైల్వే వ్యవస్థలో శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. చాలామంది ఈ ప్రీమియం రైళ్లలో ప్రయాణిస్తుంటారు. కానీ, ఆ రైలుకు 'శతాబ్ది' అని పేరు ఎందుకు పెట్టారు, దాని వెనుక ఉన్న చరిత్ర ఏంటనేది చాలామందికి తెలియదు. 'శతాబ్ది' అంటే వందేళ్ల కాలం లేదా శతజయంతి అని అర్థం. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శతజయంతి వేడుకలకు గుర్తుగా భారతీయ రైల్వే ఈ ప్రత్యేక రైలు సర్వీసును ప్రారంభించింది. 1989లో నెహ్రూ 100వ జయంతిని పురస్కరించుకుని, అప్పటి కేంద్ర రైల్వే మంత్రి మాధవరావు సింధియా ఈ ప్రతిష్ఠాత్మక రైలు సేవలను 1988లోనే పట్టాలెక్కించారు. మొట్టమొదటి శతాబ్ది ఎక్స్‌ప్రెస్ 1988 జులై 10న న్యూఢిల్లీ నుంచి ఝాన్సీ మధ్య ప్రారంభమైంది. అనతికాలంలోనే ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించడంతో ఈ సర్వీసును భోపాల్ వరకు పొడిగించారు. ప్రధాన నగరాల మధ్య పగటిపూట వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే శతాబ్ది రైళ్ల ముఖ్య ఉద్దేశం.

### శతాబ్ది రైళ్ల ప్రత్యేకతలు

శతాబ్ది రైళ్లను ప్రత్యేకంగా పగటిపూట ప్రయాణాల కోసమే రూపొందించారు. ఉదయం ఒక స్టేషన్‌లో బయలుదేరిన రైలు, గమ్యస్థానానికి చేరుకుని అదే రోజు రాత్రికి తిరిగి ప్రారంభ స్టేషన్‌కు చేరుకుంటుంది. అందుకే ఈ రైళ్లలో స్లీపర్ కోచ్‌లు ఉండవు. కేవలం కూర్చుని ప్రయాణించేందుకు వీలుగా ఏసీ చైర్ కార్ (AC Chair Car), ఎగ్జిక్యూటివ్ క్లాస్ (Executive Class) కోచ్‌లు మాత్రమే ఉంటాయి. ప్రీమియం సర్వీస్‌గా పేరుగాంచిన ఈ రైళ్లలో టికెట్ ధరలోనే ఆహారం, పానీయాల సేవలు కూడా అందిస్తారు. సాధారణ ఇంటర్‌సిటీ రైళ్లతో పోలిస్తే దీని ఛార్జీలు కాస్త ఎక్కువగా ఉంటాయి.

### శతాబ్ది, జన్ శతాబ్ది మధ్య తేడా

శతాబ్ది రైళ్ల విజయంతో స్ఫూర్తి పొంది, సామాన్య ప్రజలకు కూడా అందుబాటు ధరల్లో వేగవంతమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో 2002లో 'జన్ శతాబ్ది' ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టారు. 'జన్' అంటే ప్రజలు అని అర్థం. ఈ రైళ్లలో ఏసీతో పాటు నాన్-ఏసీ సీటింగ్ సదుపాయాలు కూడా ఉంటాయి. టికెట్ ధరలో ఆహారం చేర్చబడి ఉండదు. ప్రయాణికులు కావాలంటే అదనంగా డబ్బు చెల్లించి కొనుగోలు చేయవచ్చు. రెండు రైళ్లూ పగటిపూట ప్రయాణించేవే అయినా, వాటి ఛార్జీలు, సౌకర్యాలు, లక్ష్యంగా చేసుకున్న ప్రయాణికుల వర్గాల్లో తేడా ఉంటుంది. శతాబ్ది రైళ్లు పగటపూట నడిచేవి కాగా, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు ప్రధానంగా రాత్రిపూట ప్రయాణించి రాష్ట్ర రాజధానులను దేశ రాజధానితో కలుపుతాయి. నెహ్రూ శతజయంతి స్ఫూర్తితో ప్రారంభమైన శతాబ్ది ఎక్స్‌ప్రెస్, నేటికీ భారతీయ రైల్వేలో అత్యంత ప్రసిద్ధి చెందిన, ముఖ్యమైన పగటిపూట ప్రీమియం రైలు సర్వీసుల్లో ఒకటిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

# బెంగాల్‌లో 'అన్నపూర్ణ' పథకంపై రగడ.. డబ్బుల కోసం రోడ్డెక్కిన మహిళలు



- అన్నపూర్ణ పథకం డబ్బులు అందడం లేదంటూ అసన్‌సోల్‌లో మహిళల నిరసన
- దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఖాతాల్లో డబ్బులు పడలేదని ఆవేదన
- తమకు న్యాయం చేయాలంటూ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట ఆందోళన
- హౌరా, బర్ద్వాన్ సహా పలు జిల్లాల్లోనూ ఇదే తరహా నిరసనలు
- దరఖాస్తుల పరిశీలన వల్లే జాప్యమని చెబుతున్న బెంగాల్ ప్రభుత్వం

**బెంగాల్:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నపూర్ణ యోజన కింద ఆర్థిక సాయం అందడం లేదంటూ పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్‌లో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సోమవారం జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి, తమకు రావలసిన నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటివరకు తమకు రూ.3,000 నెలవారీ సాయం అందలేదని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్త కూలీగా పనిచేస్తున్నాడని, నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేసినా డబ్బులు రాలేదని ఓ మహిళ వాపోయింది. మరోవైపు, ఉద్యోగాలు చేస్తున్న కొందరికి ఈ పథకం ప్రయోజనాలు అందుతుండగా, అద్దె ఇళ్లలో ఉండే తమలాంటి పేద కుటుంబాలను పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2026 జూన్‌లో ఈ అన్నపూర్ణ యోజనను ప్రారంభించింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 అందిస్తారు. అయితే, అసన్‌సోల్‌తో పాటు హౌరా, బర్ద్వాన్, మాల్దా సహా పలు జిల్లాల్లోనూ ఇదే తరహా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆధార్-బ్యాంకు అనుసంధాన సమస్యలు, పరిశీలనలో జాప్యం వంటి కారణాలతో చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రానున్న దుర్గా పూజ, అక్టోబర్ 6న జరగనున్న అసెంబ్లీ ఉపఎన్నికల నేపథ్యంలో ఈ ఆందోళనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో పరిశీలనకు సమయం పడుతోందని, అర్హులందరికీ డబ్బులు అందుతాయని ముఖ్యమంత్రి సువేందు అధికారి భరోసా ఇచ్చారు.

# ఢిల్లీలో చెక్క పెట్టెలో అస్థిపంజరం.. దర్యాప్తులో తేలిన అసలు నిజం!

- ఢిల్లీలో పరిశుభ్రతా కార్యక్రమంలో చెక్క పెట్టెలో అస్థిపంజరం లభ్యం
- అది మానవ అస్థిపంజరం కాదని తేల్చిన ఫోరెన్సిక్ నిపుణులు
- పాఠశాల ల్యాబ్‌లో వాడిన కృత్రిమ అస్థిపంజరంగా గుర్తింపు
- పాత సామాన్లతో పాటు స్క్రాప్‌కు అమ్మేసిన ప్రభుత్వ పాఠశాల
- ఈ ఘటనలో ఎలాంటి నేరం జరగలేదని స్పష్టం చేసిన పోలీసులు



**ఢిల్లీ:** రాజధాని ఢిల్లీలో ఓ చెక్క పెట్టెలో అస్థిపంజరం బయటపడటం తీవ్ర కలకలం రేపింది. అయితే, పోలీసుల దర్యాప్తులో అది మానవ అస్థిపంజరం కాదని, కేవలం కృత్రిమమైనదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యా అవసరాల కోసం పాఠశాలలో ఉపయోగించిన పాత అస్థిపంజరం స్క్రాప్ దుకాణానికి చేరినట్లు విచారణలో వెల్లడైంది. వివరాల్లోకి వెళితే.. మధ్య ఢిల్లీలోని డీడీయూ మార్గ్‌లో ఉన్న కాళీమాత ఆలయం సమీపంలో శనివారం ఢిల్లీ బీజేపీ నేతలు, కార్యకర్తలు పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో వారికి ఓ పాత చెక్క పెట్టె కనిపించింది. అనుమానంతో దాన్ని తెరిచి చూడగా, లోపల అస్థిపంజరం ఉండటంతో వారు తీవ్ర ఆందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెక్క పెట్టెను, దానిలోని అస్థిపంజరాన్ని పరిశీలించారు. పెట్టెపై గానీ, పరిసరాల్లో గానీ రక్తపు మరకలు లేదా ఇతర అనుమానాస్పద ఆనవాళ్లు ఏవీ లేవని గుర్తించారు. అనంతరం ఫోరెన్సిక్, క్రైమ్ విభాగం బృందాలను రప్పించి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఫోరెన్సిక్ నిపుణులు జరిపిన ప్రాథమిక పరిశీలనలో అది మానవ అస్థిపంజరం కాదని, కృత్రిమ ఎముకలతో తయారు చేసిన నమూనా అని తేల్చారు.

పోలీసులు జరిపిన లోతైన విచారణలో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. మహమ్మద్ షకీల్ అనే స్క్రాప్ డీలర్‌కు చెందిన దుకాణం వద్ద ఈ పెట్టెను గుర్తించినట్లు ఢిల్లీ బీజేపీ ఉపాధ్యక్షుడు రాజేశ్ భాటియా తెలిపారు. ఆ అస్థిపంజరాన్ని మాతా సుందరి రోడ్డులోని ప్రభుత్వ బాలుర సీనియర్ సెకండరీ పాఠశాల నుంచి పాత సామాన్లతో పాటు స్క్రాప్‌లో కొనుగోలు చేసినట్లు షకీల్ వెల్లడించాడు. దీంతో పోలీసులు పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించారు. తమ పాఠశాల 2023లో కొత్త భవనంలోకి మారిందని, పాత భవనంలోని విరిగిన, పనికిరాని వస్తువులను జూలై 2026లో నిర్వహించిన పరిశుభ్రతా కార్యక్రమంలో భాగంగా స్క్రాప్‌కు విక్రయించినట్లు ఆయన ధ్రువీకరించారు. పాఠశాల ల్యాబొరేటరీలో విద్యార్థుల అవగాహన కోసం ఈ కృత్రిమ అస్థిపంజరాన్ని ఉపయోగించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి నేరపూరిత కోణం లేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కొమ్మాలపాటి శ్రీధర్ భేటీ

క్రోసూరు, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్: నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజక వర్గం స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి తో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 29న ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో జరగనున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటన, పల్లెపం డుగ--3.0 కార్యక్రమం నిర్వహణకు సంబం ధించిన ఏర్పాట్లపై చర్చించారు. అలాగే పల్లెపం డుగ--3.0లో భాగంగా నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయడం, పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులను సమీకరించడం, కార్యక్రమానికి సంబం ధించిన సమన్వయం తదితర అంశాలపై నేతలు చర్చించారు.



## తిరుమల కొండపై వెల్లువెత్తిన భక్తులు.. నిండిపోయిన క్యూ కాంప్లెక్స్

- తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ
- శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం
- కంపార్ట్‌మెంట్లు నిండి బయట బారులు తీరిన భక్తులు
- శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.94 కోట్లు

తిరుమల, (సింధూర దర్శిని) 27 సెప్టెంబర్: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. ఆదివారం ఉదయం అధికారుల వెల్లడించిన సమాచారం ప్రకారం, స్వామివారి సర్వదర్శనం కోసం భక్తులు సుమారు 24 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. వారాంతం కావడంతో పాటు, వర్షాలు తగ్గుముఖం పట్టి వాతావరణం అనుకూలించడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. భక్తుల తాకిడి పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో భక్తులు కాంప్లెక్స్ వెలుపల ఉన్న క్యూలైన్లలో దర్శనం కోసం వేచి ఉన్నారు. పెరుగుతున్న రద్దీని క్రమబద్ధీకరించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) యంత్రాంగం తగిన చర్యలు చేపడుతోంది. శనివారం ఒక్కరోజే 82,181 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 37,633 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిన్న ఒక్కరోజే శ్రీవారి హుండీ ద్వారా రూ. 3.94 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం వచ్చిన పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాత్రి 'పౌర్ణమి గరుడసేవ'ను అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు సాగిన ఈ వేడుకలో వేలాది మంది భక్తులు పాల్గొని గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని దర్శించుకుని తరించారు.

## ఆస్ట్రేలియాలో బీజేపీ చీఫ్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భేటీ



**ఆస్ట్రేలియా:** తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావుతో మల్లారెడ్డి భేటీ వీరి సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కూడా హాజరు రాంచందర్‌రావు ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా ఈ భేటీ నేతల భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి.. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుతో భేటీ అయ్యారు. ప్రస్తుతం రాంచందర్‌రావు ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా, అక్కడే ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కూడా పాల్గొనడం గమనార్హం. ఆస్ట్రేలియాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ముగ్గురు నేతలు కలుసుకున్నారు. వేర్వేరు రాజకీయ పక్షాలకు చెందిన ఈ నేతలు ఒకేచోట సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కాగా, తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఈ సమావేశంపై జోరుగా చర్చ జరుగుతోంది.

# సినిమా న్యూస్

## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. 'నారాయణమ్మ' పాట వచ్చేసింది!

- వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబోలో 'ఆదర్శ కుటుంబం' నుంచి తొలి పాట విడుదల
- 'నారాయణమ్మ' పేరుతో వచ్చిన ఈ మాస్ ఫోక్ నంబర్‌కు మంచి స్పందన
- పాటలో వెంకీ ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో పాటు డింపుల్ హయాతి గ్లామర్ హైలైట్
- ఇది వేరే లెవెల్ కుటుంబ కథ అంటున్న విక్టరీ వెంకటేశ్
- అక్టోబర్ 9న సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటన

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నెం. 47) నుంచి సంగీత సందడి మొదలైంది. ఈ చిత్రం నుంచి 'నారాయణమ్మ' అనే తొలి పాటను చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. తమన్ స్వరపరిచిన ఈ మాస్ ఫోక్ నంబర్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. గాయకులు రామ్ మిరియాల, ప్రభ తమ గాత్రంతో పాటకు ఊపు తెచ్చారు. ముఖ్యంగా రామ్ మిరియాల వాయిస్ పాటకు జానపద కళను అద్దింది. ఈ పాటలో వెంకటేశ్ తనదైన ఎనర్జిటిక్ స్టెప్పులతో అభిమానులను ఉత్సాహపరిచారు. హీరోయిన్లు శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్‌లతో పాటు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డింపుల్ హయాతి తన గ్లామర్, మాస్ డ్యాన్స్‌తో అదరగొట్టింది.ఈ పాట విడుదల ఈవెంట్ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, త్రివిక్రమ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "గతంలో త్రివిక్రమ్ రచయితగా ఉన్నప్పుడు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి క్లాసిక్ ప్రేమకథలు చేశాం. ఆ సినిమాల్లో నేను పెళ్లికాని వాడిని. ఇప్పుడు పెళ్లైంది, వైబ్ వేరేగా ఉంది. ఇది మామూలు కుటుంబం కాదు. 'ఆదర్శ కుటుంబం' వేరే లెవెల్‌లో ఉంటుంది. సరదాతో పాటు ప్రేక్షకులు ఎంజాయ్ చేసే ట్విస్టులు కూడా ఉంటాయి" అని సినిమాపై ఆసక్తిని పెంచారు.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదట అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించినా, తాజాగా అక్టోబర్ 9న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ మాస్ పాటతో ప్రమోషన్లు ప్రారంభించిన చిత్రబృందం, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయింది.



## హీరో భార్యకు నచ్చలేదని నన్ను తీసేశారు: తాప్సీ



- కెరీర్ తొలినాళ్లలో బాలీవుడ్‌లో ఎదురైన చేదు అనుభవాలు వెల్లడించిన తాప్సీ
- ఓ స్టార్ హీరో కూడా తనను ప్రాజెక్ట్ నుంచి తప్పించాడని వ్యాఖ్య
- టైప్‌కాస్ట్ కాకుండా ఉండేందుకు కొన్ని ఆఫర్లు వదులుకుంటున్నట్లు వెల్లడి

ప్రముఖ నటి తాప్సీ తన కెరీర్ ఆరంభంలో బాలీవుడ్‌లో ఎదుర్కొన్న కొన్ని అవమానకరమైన అనుభవాలను పంచుకున్నారు. హీరో భార్యకు తాను నచ్చలేదనే వింత కారణంతో తనను ఓ సినిమా నుంచి తనను తొలగించారని వెల్లడించారు. ఇటీవల నయన్‌దీప్ రక్షిత్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాప్సీ ఈ షాకింగ్ విషయాలను పంచుకున్నారు.తాప్సీ మాట్లాడుతూ, "ఓ సినిమాకు సంతకం చేసిన తర్వాత నన్ను తొలగించారు. కారణం ఏంటని అడిగితే, 'హీరో భార్యకు మీరు నచ్చలేదు' అని చెప్పారు. ఆ హీరో భార్యకు నేనెందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు తెలియదు" అని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ నటుడు, ఆయన భార్య ఎవరనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. మరో సందర్భంలో, ఓ ప్రముఖ హీరో తన స్థానంలో అతడికి బాగా సన్నిహితురాలైన నటిని తీసుకోవడం కోసం తనను సినిమా నుంచి తప్పించారని తాప్సీ పేర్కొన్నారు. అదే సమయంలో, పరిశ్రమలో నటీనటులను ఒకేరకమైన పాత్రలకు పరిమితం చేసే (టైప్‌కాస్ట్) ధోరణిపై కూడా తాప్సీ స్పందించారు. కొందరిని గ్లామర్ పాత్రలకు, మరికొందరిని సీరియస్ పాత్రలకు పరిమితం చేస్తారని, తన విషయంలో అలా జరగకుండా ఉండేందుకే కొన్ని ఆఫర్లను స్పష్టంగా తిరస్కరిస్తున్నానని ఆమె తెలిపారు.కాగా, తాప్సీ ఇటీవల 'అస్సి', 'గాంధారి' వంటి చిత్రాల్లో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు.

## 'మండాడి' ఫేమ్ సూరి మరో చిత్రం.. 'సంచారి'గా తెలుగులో గ్రాండ్ రిలీజ్

- 'మండాడి' ఫేమ్ సూరి, నివిన్ పాలీ నటించిన చిత్రం తెలుగులోకి
- 'సంచారి' పేరుతో అక్టోబర్ 1న గ్రాండ్ రిలీజ్
- రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా వస్తున్న సినిమా
- విలక్షణ దర్శకుడు రామ్ డైరెక్టర్, యువన్ శంకర్ రాజా సంగీతం




ఇటీవల 'మండాడి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను సైతం విశేషంగా ఆకట్టుకుని, నటుడిగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించిన ప్రముఖ తమిళ నటుడు సూరి, ఇప్పుడు మరో ఆసక్తికరమైన చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. ఆయన, మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ, అంజలి ప్రధాన పాత్రలలో నటించిన తమిళ చిత్రం 'సంచారి' పేరుతో తెలుగులో అక్టోబర్ 1న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి 'సప్త గిరులు సప్త సాగరాలు' అనేది ట్యాగ్ లైన్. కలర్స్ అండ్ క్లాప్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత ఎం. సుబ్బారెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సోషల్ మీడియాలో మంచి స్పందనను రాబడుతోంది. సినిమాలోని ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, నటీనటుల అభినయం ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 'మండాడి'తో సూరి నటుడిగా అద్భుతమైన విజయాన్ని అందుకోగా, 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' వంటి చిత్రంతో నివిన్ పాలీ కూడా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించడం తెలిసిందే. ఇలాంటి ఇద్దరు విలక్షణ నటులు కలిసి నటించిన సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.ఈ చిత్రానికి 'తంగ మీన్కల్', 'తారమణి', 'పేరంబు' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలకు దర్శకత్వం వహించిన జాతీయ అవార్డు గ్రహీత రామ్ దర్శకత్వం వహించడం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో ఈ సినిమాను ఆయన తనదైన శైలిలో తెరకెక్కించారు. ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా అందించిన సంగీతం, నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలవనున్నాయి.ఒకవైపు విలక్షణ నటులు, మరోవైపు విమర్శకుల ప్రశంసలు పొందిన దర్శకుడు, అద్భుతమైన సంగీతం కలగలిసి 'సంచారి' చిత్రంపై ప్రేక్షకులలో క్యూరియాసిటీని పెంచుతున్నాయి. అక్టోబర్ 1న థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను ఏ స్థాయిలో మెప్పిస్తుందో వేచి చూడాలి. వాస్తవానికి ఈ చిత్రం 'ఏళు కడల్ ఏళు మలై' పేరుతో తమిళంలో కొన్నాళ్ల కిందటే రూపుదిద్దుకుంది. ఇటీవల 'మండాడి'తో సూరి హిట్ కొట్టడం తెలిసిందే. ఇందులో తెలుగు నటుడు సుహాస్ కూడా ఉండడంతో తెలుగులోనూ 'మండాడి'కి మంచి మార్కులే పడ్డాయి. దాంతో సూరి గతంలో నటించిన 'ఏళు కడల్ ఏళు మలై' చిత్రాన్ని 'సంచారి' పేరుతో తెలుగులోకి తీసుకువస్తున్నారు.

## మూర్ఖులతో వాదిస్తే మనమూ మూర్ఖులమే: ఫ్యాన్స్‌కు సూర్య హితవు

- సోషల్ మీడియా ఫ్యాన్ వార్స్‌కు దూరంగా ఉండాలన్న సూర్య
- మూర్ఖులతో వాదించొద్దని సలహా
- ప్రేమను పంచి, మీ పని మీరు చేసుకోండని సూచన
- సూర్య వ్యాఖ్యలపై మిశ్రమ స్పందనలు.. మొదలైన కొత్త చర్చ

తమిళ స్టార్ హీరో సూర్య తన అభిమానులకు కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో జరిగే ఫ్యాన్ వార్స్‌లో పాల్గొనవద్దని, ఆన్‌లైన్ ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని హితవు పలికారు. "మూర్ఖులతో వాదిస్తే మనం కూడా మూర్ఖుల్లాగే కనిపిస్తాం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.అఖిల భారత సూర్య ఫ్యాన్స్ క్లబ్ నిర్వహించిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం ప్రేమను మాత్రమే పంచుదాం. ఎవరో ఓ మూర్ఖుడు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని మనం కూడా స్పందిస్తే, చివరికి మనం కూడా మూర్ఖులమే అవుతాం, బాధపడతాం. మనం మనలా ఉందాం, వాళ్లను వాళ్లలా ఉండనీయండి. వాళ్లకు నచ్చజెప్పాలని, మార్చాలని ప్రయత్నించడం కష్టం. కొంతమంది అర్థం చేసుకున్నా, చాలామంది మారరు. మీ శక్తిని వృథా చేసుకోవద్దు. మీకు ఇష్టమైన పనిని ప్రతిరోజూ నిబద్ధతతో చేయండి, విజయం తప్పక వరిస్తుంది" అని సూర్య అభిమానులకు దిశానిర్దేశం చేశారు. కోలీవుడ్‌లో హీరోల అభిమానుల మధ్య సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో ఫ్యాన్ వార్స్ జరగడం సాధారణమే. ముఖ్యంగా కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఈ ట్రోలింగ్ మరింత ఎక్కువవుతుంది. ఈ క్రమంలో నటుడు సూర్య కూడా తరచూ ట్రోలింగ్ బారిన పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన అభిమానులకు



ఈ విధంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది.అయితే, సూర్య వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఇతర హీరోల అభిమానులు, ఆయన తమను 'మూర్ఖులు' (ముట్టల్) అని పిలుస్తున్నారని, ఆయన భాషలో పరిణతి లేదని విమర్శిస్తున్నారు. మరోవైపు, సూర్య అభిమానులు మాత్రం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. "ఈ మాటలు మీకు తగిలితే, సూర్య చెబుతున్న ఆ మూర్ఖులు మీరే" అంటూ కౌంటర్లు ఇస్తున్నారు.ఈ ఏడాది సూర్యకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా బాగా కలిసొచ్చింది. ఇటీవల తన భార్య జ్యోతికతో 20వ వివాహ వార్షికోత్సవాన్ని స్కాట్లాండ్‌లో జరుపుకున్నారు. ఆయన నటించిన 'కరుప్పు', 'విశ్వనాథ్ & సన్స్' చిత్రాలు వరుసగా విజయాలు సాధించాయి. ఇటీవలే హీరోలు విజయ్, అజిత్ కుమార్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కనిపించడం, ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని అజిత్ కూడా గతంలో అభిమానులకు సూచించడం వంటి పరిణామాల నేపథ్యంలో సూర్య వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662